

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'ను విజయవంతం చేయాలి'

పార్వతీపురం, మే 16(ఆంధ్రజ్యోతి):జిల్లాలో శనివారం నిర్వహించనున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. 'బీట్ ద హీట్' పేరున ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రతి కార్యాలయంలోనూ అధికారులు, సిబ్బంది పాల్గొని పరిశుభ్ర వాతావరణం నెలకొనే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములయ్యేలా చేయాలని ఆదేశించారు.

ఈదురుగాలులతో అస్తవ్యస్తం

- జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం
- గాలులకు నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- ఉరుములు.. మెరుపులతో జనం బెంబేలు
- పిడుగుపాటుకు ఇద్దరి మృతి
- పంటలను కాపాడుకునే పనిలో రైతులు

సీతంపేట రూరల్/ భామిని/ పాలకొండ, మే16 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పలుచోట్ల శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో అనేక ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఉరుములు... మెరుపులు... పిడుగుల శబ్దాలకు జనం బెంబేలెత్తిపోయారు. మధ్యాహ్నం వరకూ ఎండ ఠారెత్తించింది. ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. దట్టంగా మేఘాలు కమ్ముకున్నాయి. ఆ తర్వాత జోరువాన కురిసింది. సీతంపేట ఏజెన్సీ ప్రాంతం పూర్తిగా చల్లబడింది. దీంతో గిరిజనులు ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం పొందారు. భామిని మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. సొలికిరి సమీపంలో 33 కేవీ వైర్లపై చెట్లు పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంబేడ్కర్ గురుకులంలో చెట్టు, విద్యుత్ స్తంభం నేలకూలాయి. దీనిపై ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసరావును వివరణ కోరగా.. సొలికిరి, బాలేరు వద్ద భారీ చెట్లు నేలకూలడంతో వైర్లు తెగిపోయాయన్నారు. విద్యుత్ సరఫరాకు కొంత సమయం పడుతుందన్నారు. అకాల వర్షాల కారణంగా మరోవైపు రైతులు వరి, మొక్కజొన్న, నువ్వుపంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.



వరి, మొక్కజొన్న పంటలపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం



బాలేరు-సొలికిరి మధ్య విద్యుత్ లైన్లపై పడిన చెట్టు



భామిని: అంబేడ్కర్ గురుకులంలో కూలిన విద్యుత్ స్తంభం, భారీ చెట్టు

పిడుగుపాటుకు గిరిజన యువకుడి మృతి



సవర చంద్రరావు (ఫైల్)

సీతంపేట మండలం గిరిశిఖర గ్రామం జగతిపల్లి బూర్జగూడకి చెందిన సవర చంద్రరావు(31) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఎస్ఐ వై.అమ్మ నరావు తెలిపిన వివరాల ప్రకారం.. జగతిపల్లి బూర్జగూడ గ్రామానికి చెందిన చంద్రరావు పాలకొండ ఆర్టీసీ డిపోలోని బంక్‌లో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడూ వ్యవసాయ పనులు కూడా చేస్తుంటాడు. కాగా పదేళ్ల కిందటే తండ్రి మృతి చెందడంతో తల్లి సొట్టమ్మ వద్దే ఉంటున్నాడు. నాలుగురు అన్నదమ్ముల్లో ఆఖరి వాడైన చంద్రరావు శుక్రవారం సాయంత్రం దేవనాపురం గ్రామ సమీపంలోని పొలంలో పనులకు వెళ్లాడు. అయితే ఆ సమీపంలో పిడుగు పడ డంతో గిరిజన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా చంద్రరావు అకాల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పాలకొండలో మహిళ..



జోగలక్ష్మి (ఫైల్)

ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో నగర పంచాయతీ (మిగతా 8వ పేజీలో..)

పిడుగులు పడేటప్పుడు అప్రమత్తం: కలెక్టర్

పార్వతీపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): పిడుగులు పడేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. వాతావరణ మార్పులపై రాష్ట్ర విపత్తుల సంస్థ ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఫోన్ ద్వారా కూడా అందిస్తుందన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు చెట్లు, టవర్లు, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని పేర్కొన్నారు. సురక్షిత భవనాల్లో ఆశ్రయం పొందాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు తలకు టోపీ పెట్టుకోవాలని, చేతి రుమాలు ఉంచుకోవాలని సూచించారు. ఎక్కువగా మజ్జిగ, గ్లూకోజ్, నిమ్మరసం, కొబ్బరినీరు, ఓఆర్ఎస్ తాగాలన్నారు.

ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- జూన్ 2లోగా పూర్తికానున్న ప్రక్రియ
- ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన వారికి మార్పు తప్పనిసరి
- ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ప్రాధాన్యం
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

పార్వతీపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిషేధాన్ని సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 2 వరకు బదిలీలు, పోస్టింగులకు అవకాశం కల్పించింది. ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన వారు ఈ నెలాఖరుకు తప్పనిసరిగా బదిలీ అవుతారు. ఐదేళ్లు పూర్తికాని ఉద్యోగులు కూడా అభ్యర్థనపై బదిలీలకు అర్హులు. కొన్ని కేటగిరీలకు సంబంధించి కొన్ని మినహాయింపులు ఉంటాయని మార్గదర్శకాల్లో ప్రభుత్వం సూచించింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగులకు స్థానచలనం నుంచి మినహాయింపు లేదా ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. వచ్చే ఏడాది మే 31లోపు ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగులకు ఈ సాధారణ బదిలీల నుంచి మినహాయింపు లభిస్తుంది. వారిని విజ్ఞప్తి లేదా పరిపాలనా కారణాలతో స్థానచలనం కల్పించొచ్చు. అంధులైన ఉద్యోగులు, మానసిక దివ్యాంగ పిల్లలున్న కలిగిన ఉద్యోగులకు వారి కోరిక మేరకు బదిలీల్లో ప్రాధాన్యం కల్పిస్తారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న వారు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి అభ్యర్థన మేరకు బదిలీలు చేపడతారు. వితంతువులైన ఉద్యోగుల వినతి మేరకు బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. భార్యాభర్తలకు ఒకే చోట లేదా సమీప ప్రాంతాల్లో పనిచేసేలా చర్యలు తీసుకోనున్నారు. గత ఏడాది సెప్టెంబరు నెలలో బదిలీలు ప్రక్రియ నిర్వహించగా, ఈ సారి పాఠశాలల సెలవులు ముగిసేలోగా ఈ ప్రక్రియ పూర్తి చేసే విధంగా ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. చివరి రోజునే రెవెన్యూ తోపాటు చాలా శాఖల్లో బదిలీలు నిర్వహించడం అనవాయితీగా జరుగుతుంది. ఈ సారి బదిలీలు ముందుగా పూర్తి చేస్తారా? చివరి రోజునే ప్రక్రియ పూర్తి చేస్తారా? అనేది అధికారులకే తెలియాలి.

విద్యాశాఖ మినహా ..

విద్యా శాఖ మినహా జిల్లాలోని 52 ప్రభుత్వ శాఖల ఉద్యోగలకు ఈ బదిలీలు వర్తించనున్నాయి. రెవెన్యూ, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ శాఖలు, ఖజానా, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, హౌసింగ్ , జడ్పీ, ఆర్అండ్‌బీ , మున్సిపల్ , పశు సంవర్థక , పరిశ్రమలు, ఇరిగేషన్, వాణిజ్యం తదితర శాఖల్లో అర్హులైన వారు బదిలీలు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా సుమారు 13 వేల ఉద్యోగులు ఉన్నారు.

నేతల వద్దకు ...

బదిలీలకు ఉత్వర్తులు ఇవ్వడంతో ఉమ్మడి జిల్లాలో ప్రజా ప్రతినిధులు వద్దకు అధికారులు, సిబ్బంది క్యూ కడుతున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ పని చేసేరంతా తమ కావల్సిన స్థానం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రజా ప్రతినిధుల సిఫారసుల కోసం గట్టిగా పైరవీలు సాగిస్తున్నారు. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్ని కలు జరగనున్న నేపథ్యంలో తమ కావల్సిన ఉద్యో గులను తెచ్చుకోవాలని కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు కూడా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా ఈ సారి ఉద్యోగులు బదిలీల్లో నిబంధ లను పాటిస్తారా? సిఫారుసులకు పెద్ద పీట వేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.



ఐదేళ్లు పూర్తికాని వారే అత్యధికం...

మన్యం జిల్లా ఏర్పడి మూడేళ్లు గడుస్తుండడంతో ఇక్కడ ఐదేళ్లు సర్వీసు పూర్తికాని ఉద్యోగులే అత్యధికంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన అయితే ఇక్కడ పనిచేసే వారికి బదిలీ జరిగే అవకాశం ఉంది. పార్వతీపురం మన్యం జిల్లా విషయానికొస్తే ఇక్కడ బదిలీలు తక్కువగా ఉంటాయని చెప్పవచ్చు. కాగా గిరిజన ప్రాంతాల నుంచి బదిలీలు ఎక్కువగా జరగ నున్నాయి. రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న అధికారులు స్థానచలనం కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

- సిబ్బందికి ఎస్పీ మాధవరెడ్డి సూచన

జియ్యమ్మవలస, మే 16(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించి.. త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి ఆదేశించారు. శుక్రవారం చినమేరంగి సర్కిల్ కార్యాలయంతో పాటు జియ్యమ్మవలస, చినమేరంగి పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా స్టేషన్ల పరిసరాలను పరిశీలించి.. పలు విషయాలపై ఆరా తీశారు. సైబర్ నేరాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గంజాయి, మత్తు మందు సరఫరా చేస్తున్న ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, సారా నియంత్రణ తదితర అంశాలపై సూచనలిచ్చారు. ఈ పరిశీలనలో సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్ఐలు పి.అనీష్, ఎం.ప్రశాంత్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



చినమేరంగి స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

సాగునీటి నిల్వలకు ప్రత్యేక చర్యలు

- రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి, మే16(ఆంధ్రజ్యోతి): వర్షాధార ప్రాంతాల్లో సాగునీటి నిల్వలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కొంకడివరంలో చెరువు ఫీడర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..' సాగునీరు వృథాగా పోకుండా ఉండేందుకు ఉపాధి హామీ నిధులతో జిల్లాలో 120 చెరువులను అభివృద్ధి చేస్తాం. రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పంట పొలాలు బీడు భూములుగా మారకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నాం. గరుగుబిల్లి మండలానికి సంబంధించి 11 చెరువు పనులు మంజూరు చేశాం.' అని తెలిపారు. అనంతరం ఉపాధి వేతనదారుల సమస్యలు తెలుసుకున్నారు. వేతనాలు ఏ మేరకు అందుతున్నాయని వారిని అడిగి తెలుసుకున్నారు. వడదెబ్బకు గురికాకుండా ఉదయం పూట పనులకు వేగంగా హాజరు కావాలన్నారు. నిర్దేశించిన ప్రాంతంలో కొలతల మేరకు పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమయపాలన పాటిస్తే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూర్చేందుకు ఫాంపాండ్స్, సాగునీటి కాలువలు, చెరువులను కలిపే విధంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీల్లో నిర్వహించిన పనులకు చెల్లింపులు కావడం లేదని సర్పంచ్ అల్లు అప్పలనాయుడు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కొద్దిరోజుల్లో చెల్లింపులు జరుగుతాయని కలెక్టర్ చెప్పారు. 'ఉపాధి'కి సంబంధించి నిధుల సమస్య లేదని, పంచాయతీల వారీగా మంజూరైన పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎంపీడీవో జి.పైడితల్లి, ఏపీవో ఎం.గౌరీనాథ్, టీడీపీ ప్రతినిధులు, జల వనరులశాఖ అధికారులు పాల్గొన్నారు.



చెరువు ఫీడర్ చానల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్

గృహ నిర్మాణాలు వేగవంతం

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో చేపడుతున్న పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గృహ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయని, నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేయాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు పంచాయతీల వారీగా గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏపీడీలు, పీహెచ్‌వోలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న మండలాల్లో జీడి మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఈ సమావేశంలో పీఏవో శ్రీనివాస్, వెలుగు ఏపీడీ వై.సత్యంనాయుడు, ఉపాధి ఏపీడీ సురేష్‌నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఆర్.కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ


సకాలంలో బిల్లులు చెల్లిస్తాం: సబ్ కలెక్టర్

సీతంపేట రూరల్: గృహ నిర్మాణాలకు సకాలంలో బిల్లులు చెల్లిస్తామని పాలకొండ సబ్ కలెక్టర్, సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పెద్దగూడ, మండ దీసరగూడ గ్రామాల్లో పీఎం జన్‌మన్ లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఈ నెలాఖరు నాటికి చెల్లింపులయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి నిర్మాణాలు పూర్తయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- సీతంపేటలోని రెండు కేంద్రాల్లో పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ తరగతులను ఇన్‌చార్జి పీవో పరిశీలించారు. సప్లిమెంటరీ పరీక్షల కోసం బాగా చదివి ఉత్తీర్ణులు కావాలని సూచించారు. టెన్త్‌లో ఫెయిలైనంత మాత్రాన నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. విద్యార్థులకు సందేహాలు ఉన్న పాఠ్యాంశాలను మళ్లీ అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

గుండె గుబిల్లుమంటోందా?

- చిన్న చిన్న జాగ్రత్తలతో విద్యుత్ ఆదా
- అవగాహనతోనే పొదుపుగా వినియోగం
- చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా మోత తప్పదు



6లో

జాతరలో అప్రమత్తత అవసరం

- సిబ్బందికి డీఎంహెచ్‌వో ఆదేశం
- శ్యామలాంబ పండుగ నేపథ్యంలో సమీక్ష

6లో



విజయ పతాకం

- ఘనంగా తిరంగా ర్యాలీ



సాలూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి

6లో



పార్వతీపురం టౌన్/ బెలగాం: అతిపెద్ద జాతీయ పతాకంతో...

విజయ పతాకం

● ఘనంగా తిరంగా ర్యాలీ

'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం తిరంగా ర్యాలీలను ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీల్లో జిల్లాలోని ప్రజాప్రతినిధులు.. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భారీ త్రివర్ణ పతకాలతో ర్యాలీలు నిర్వహించారు. అమర జవానులకు నివాళులర్పించారు. త్రివిధ దళాల ధైర్యసాహసాలను కొనియాడారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పార్వతీపురం టౌన్/ బెలగాం: తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర తదితరులు



సాలూరు: మెయిన్ రోడ్డు కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం



విజయనగరం: మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు



రాజాం: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, తదితరులు



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి శ్రీనివాస్

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బొండపల్లిలో శుక్రవారం సాయంత్రం మంత్రి శ్రీనివాస్ ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. తమ గ్రామాల్లో సీసీ రోడ్లు, శ్మశాన వాటికలకు ప్రహరీలు ఏర్పాటు చేయాలని పలువురు వినతులు అందజేశారు. మరికొందరు వ్యక్తిగత సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి.రాజేశ్వరరావు, ఎంపీడీవో తులసీనాథ్, ఏపీఎం పెంటంనాయుడు, ఏపీవో అరుణ, సర్పంచులు బొండపల్లి ఈశ్వరరావు, కర్రోతు శ్రీనివాసరావు, నంబూరి రాజేష్, ఈదుబిల్లి కృష్ణ, నడుపూరి భాస్కర నాయుడు, మాజీ జెడ్పీటీసీ బండారు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామంగా అప్పయ్యపేట

● గ్రామస్థుల తీర్మానం

నెల్లిమర్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట పంచాయతీలోని అప్పయ్యపేటను సారా రహిత గ్రామంగా చేయాలని స్థానికులు తీర్మానించారు. ఈమేరకు నెల్లిమర్ల ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు, ఎస్ఐ ఎం.నాగేశ్వరరావు ఈ విషయాన్ని ప్రకటించారు. కొన్ని సంవత్సరాలుగా సారా తయారీతో పాటు అమ్మకాలతో అప్పయ్యపేట బి-కేటగిరీ గ్రామంగా ఉందన్నారు. నవోదయం 2.0 పేరిట అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వల్ల గ్రామ పెద్దలతో పాటు ప్రజల్లోనూ మార్పు వచ్చిందని వారు తెలిపారు. ఈ మార్పు శుభ పరిణామమని అన్నారు. గత 3 నెలలుగా గ్రామంలో సారా తయారీకి సంబంధించి ఎలాంటి ఆరోపణలు లేవని వెల్లడించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని.. కేసులు నమోదు కాలేదని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో సారా రహిత గ్రామంగా ప్రకటిస్తూ సర్పంచ్ అట్టాడ శ్రీనుతో పాటు పంచాయితీ కార్యదర్శి బంగార్రాజు, అడాప్షన్ అధికారి వి.కృష్ణ తదితరులు గ్రామస్థుల సమక్షంలో చేసిన తీర్మానం కాపీని వారు విడుదల చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటరావు



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

మూఢనమ్మకాలతో ఇక్కట్లకు గురికావద్దు

విజయనగరం, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన గ్రామాల్లో మూఢ నమ్మకాలతో ప్రజలు ఇక్కట్లకు గురికాకుండా అవగాహన కల్పించి.. వాటిని నిరోధించేందుకు కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు వి.బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం గురజాడ స్కూల్‌లో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ, గిరిజన గ్రామాలో మూఢనమ్మకాలను పారద్రోలేందుకు జిల్లా కమిటీ ఎంతో కృషి చేసిందన్నారు. రాష్ట్ర నాయకులు సుధాకరరావు మాట్లాడుతూ తెలుగుభాషను సులభంగా ఎలా నేర్పించాలన్న మెలకువలను పిల్లలకు తెలియజేయాలన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణాజీ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా నిరక్షరాస్యులు, పేదలు, గిరిజనులు ఉన్నారని గుర్తు చేశారు. జిల్లాలో కమిటీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జేవీవీ ప్రతినిధులు రమేష్‌రాజు, లక్ష్మణరావు, రాజశేఖర్, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ వనంగుడిలో చండీహోమం



పైడిమాంబ ఆలయంలో హోమం చేస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ వనంగుడిలో మూలానక్షత్రం సందర్భంగా శుక్రవారం చండీహోమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పైడిమాంబను వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. వివిధ రకాల పండ్లు, పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాన్ని అందించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుండె గుబిల్లుమంటోందా?



● చిన్న చిన్న జాగ్రత్తలతో విద్యుత్ ఆదా
● అవగాహనతోనే పొదుపుగా వినియోగం
● చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా మోత తప్పదు

చీపురుపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి)

సాధారణంగా ఎండా కాలంలో విద్యుత్ బిల్లులు మోత మోగిస్తాయి. ఉక్కపోత కారణంగా విద్యుత్ వినియోగం అధికమై.. సామాన్యులు సైతం రూ.వేలల్లో బిల్లులు కట్టాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. వర్షాలు కురుస్తున్న సమయంలో వాతావరణం చల్లబడినప్పటికీ కొంతమందికి అధిక మొత్తంలో బిల్లులు వస్తుంటాయి. విద్యుత్ మీటర్‌లో తలెత్తిన లోపాల వల్ల ఇలా జరగొచ్చు. అంతే కాకుండా విద్యుత్ వినియోగంలో మనం ప్రదర్శించే చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల కూడా ఒక్కోసారి ఊహించని విధంగా బిల్లులు భారీగా వస్తాయి. విద్యుత్ పరికరాల వినియోగించే సమయంలో కొన్ని పొదుపు సూత్రాలు పాటిస్తే ఎంచక్కా విద్యుత్ బిల్లులకు కళ్లెం వేయొచ్చు. రోజు వారీ విద్యుత్ వాడకంలో చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే కనీసం 25 నుంచి 30 శాతం బిల్లు మొత్తాన్ని ఆదా చేయొచ్చు. తెలిసినవే కదా అని... నిర్లక్ష్యం చేస్తే డబ్బులు, విద్యుత్ రెండూ నష్టపోవాల్సి వస్తుంది.



● కిటికీలు, తలుపులు తెరచి ఉంచాలి..

కొంత మంది పగటి పూట కిటికీలు, తలుపులు మూసి బల్బులు, ఫ్యాన్లు వేసుకుంటారు. దీంతో విద్యుత్ వినియోగం పెరిగిపోతుంది. పగటి పూట కిటికీలు, తలుపులు తెరచి ఉంచితే సహజ వెలుతురు, గాలి వస్తుంది. గదుల్లో అవసరం మేరకు మాత్రమే బల్బులు వేసి ఉంచాలి. ఒక గదిలో బల్బులు ఆన్‌చేసి, వేరే గదుల్లో కూర్చుంటాం. రోజుకు రెండు, మూడుగంటలు ఇలాంటి అనవసర విద్యుత్ వినియోగాన్ని అరి కడితే నెలకు 6 నుంచి 10 యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.



● మోసగిస్తున్న జీరో బల్బులు..

ఇళ్లలో వినియోగిస్తున్న జీరో వాట్ సాధారణ బల్బులు సున్నితంగా మోసం చేస్తున్నాయి. జీరో వాట్ బల్బు అని... విద్యుత్ ఎక్కువగా వినియో గించే పని ఉండదని చాలా మంది నమ్ముతారు. కానీ, ఇవి జీరో కాదు. 12 నుంచి 15 వాట్స్ శక్తి కలిగి ఉన్నందున విద్యుత్‌ను బాగానే తీసుకుంటాయి. వీటి స్థానంలో ఒక వాట్ ఎల్ఈడీ బల్బులను వాడితే నెలకు 10 నుంచి 15 యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేసుకొనే అవకాశం ఉంటుంది.



● ఫ్రిజ్‌లను తరచూ తెరుస్తుంటే...

రెఫ్రిజిరేటర్‌లను చాలా మంది మాటిమాటికీ తెరుస్తుంటారు. ఇది మంచిది కాదు. ఉదయం పూట వంటకు అవసరమైన వస్తువులన్నీ ఒకేసారి తీసుకోవడం మంచిది. తరచూ తెరవడం వల్ల కూలింగ్ తగ్గి, తిరిగి కవర్ చేసుకొనేందుకు ఎక్కువ విద్యుత్‌ను తీసుకుంటుంది. ఫ్రిజ్‌లో ఆహార పదార్థాలపై మూతలు పెట్టడం మరువకూడదు. 15 ఏళ్ల దాటిన ఫ్రిజ్‌లను మార్చడం మంచిది.



● పరిమితంగా ఏసీలు..

ఏసీలు పరిమితంగా వాడాలి. ఒకప్పుడు పట్టణాలు, ధనవంతుల ఇళ్లలో ఉండే ఏసీలు అవసరాలను బట్టి గ్రామాలకు విస్తరించాయి. వీటికి విద్యుత్ వినియోగం ఎక్కువ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరం మేరకే ఏసీలను వాడాలి. ఆటో ఆఫ్‌లు ఏర్పాటు చేసుకోవడం మంచిది. మాటి మాటికీ స్విచ్ఛాన్... స్విచ్ఛాఫ్ చేయడం వల్ల విద్యుత్ వృథా అవుతుంది.



● చార్జర్‌లతో..

సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్స్ చార్జింగ్ కాగానే స్విచ్ ఆఫ్ చేయాలి. చాలా మంది బటన్ ఆఫ్ చేయకుండానే వదిలి వేస్తుంటారు. ఇంకా కొన్ని ఇళ్లలో ఉదయం నుంచి నిద్రపోయే వరకూ టీవీలను అదే పనిగా ఆన్ చేసి ఉంచుతారు. టీవీలతో విద్యుత్ వృథా ఎక్కువగానే ఉంటుంది. చార్జింగ్‌ల వల్ల తక్కువ విద్యుత్ ఖర్చవుతుందని చాలా మంది అనుకుంటారు. అయితే, ఒక్క యూనిట్ అనవసర వినియోగం వల్ల ఏకంగా శ్లాబ్ పరిమితి మారిపోవచ్చు. దీంతో యూనిట్ చార్జి కూడా మారిపోయి బిల్లు మొత్తం పెరగడానికి దారితీయొచ్చు.



● ఫ్యాన్లతో..

బల్బుల తరువాత ఇళ్లల్లో ఫ్యాన్ల వినియోగం ఎక్కువ. విద్యుత్ వినియోగంలో ఫ్యాన్ల భాగస్వామ్యమే ఎక్కువ. నాసి రకం ఫ్యాన్లతో విద్యుత్ వినియోగం పెరుగుతుంది. అదేవిధం గా ఫ్యాన్లను శుభ్రం చేసేటప్పుడు జాగ్రత్తలు కూడా పాటించాలి. ఫ్యాన్ రెక్కలు పట్టుకొని శుభ్రం చేయకూడదు. ఇలా చేయడం వల్ల రెక్కలు ఉండాల్సిన 10-12 డిగ్రీల కోణం దెబ్బతింటుంది. దీంతో అవి తిరిగేటప్పుడు ఎక్కువగా విద్యుత్‌ను తీసుకుంటాయి. అలాగే రెగ్యులేటర్ తప్పనిసరిగా వాడాలి. లేదంటే అవసరం ఉన్నా లేపోయినా ఫ్యాన్ అతివేగంగా తిరగడం వల్ల అనవసరంగా విద్యుత్ వాడాల్సి వస్తుంది.



● ఇస్త్రీ పెట్టెతో చిన్నపాటి జాగ్రత్తలు..

ఇళ్లలోనే దుస్తులు ఇస్త్రీ చేసుకోవడం చాలా మందికి అలవాటు. ఆ సమయంలో అవగాహన లేక కొంత విద్యుత్ వృథా అవుతోంది. ఇస్త్రీ పెట్టెకు గల స్విచ్ ఆన్ చేసి... అదే పనిగా ఇస్త్రీ చేయడం వల్ల ఇలా జరగుతుంది. దీనికి బదులు పెట్టె వేడెక్కగానే స్విచాఫ్ చేసి, దుస్తులు ఇస్త్రీ చేయాలి. వారానికో, పది రోజులకో దుస్తులన్నీ ఎక్కువగా ఒకేసారి ఇస్త్రీ చేయడం వల్ల విద్యుత్‌ను పొదుపుగా వాడొచ్చు.

జాతరలో అప్రమత్తత అవసరం

● సిబ్బందికి డీఎంహెచ్‌వో ఆదేశం



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

సాలూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): శ్యామలాంబ జాతర సందర్భంగా ప్రజలకు ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో శుక్రవారం పీపీ యూనిట్‌లో సమీక్ష నిర్వహించారు. జాతర సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారని... జన సమూహం ఉండే ప్రదేశాల్లో 14 వైద్య శిబిరాలు నిర్వహించనున్నామని తెలిపారు. అవసరమైన మందులు, వైద్య పరీక్షలకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి రీత్యా అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అత్యవసర వైద్య సేవలకు 108 అంబులెన్స్‌లను, ఫీడర్ అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. షిఫ్టుల వారీగా వైద్య సిబ్బందిని శిబిరాల్లో ఉంచేలా ప్రణాళిక తయారుచేసినట్టు వివరించారు. 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. దోమల నివారణకు అవసరమైన కీటక నాశిని మందులను మున్సిపల్ కార్యాలయానికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ పీఎల్ రఘుకుమార్, ప్రత్యేక ఆరోగ్య పర్యవేక్షణాధికారి డాక్టర్ శివకుమార్, డీఎంవో మణి, వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, డెమో యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ విజయవంతానికి పటిష్ఠ చర్యలు..

సాలూరు గ్రామదేవత శ్యామలాంబ ఉత్సవాన్ని విజయవంతం చేయడానికి పటిష్ఠ చర్యలు తీసుకున్నట్టు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 15 ఏళ్ల తర్వాత నిర్వహించబోయే పండుగ కావడంతో పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బయటి నుంచి వచ్చే వాహనాలు నిలిపేందుకు 5 చోట్ల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెయ్యి మందికి పైగా పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నట్టు వెల్లడించారు. 68కిపైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితోపాటు ఆరు డ్రోన్లతో పర్యవేక్షణ ఉంటుందన్నారు. సిరిమానును ఉత్సవ కమిటీ ముందుగా ఏర్పాటు చేసిన టీం సభ్యులు మాత్రమే తీసుకువెళ్తారని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా... తప్పుగా ప్రవర్తించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చురుగ్గా ఆధునికీకరణ పనులు

● గజపతినగరం రైల్వేస్టేషన్‌కు కొత్తరూపు

గజపతినగరం, మే 16 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం రైల్వే స్టేషన్‌లో కోట్లాది రూపాయలతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. మూడో రైల్వేలైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పాత రైల్వేస్టేషన్‌కు అనుగుణంగా కొత్తగా రైల్వేస్టేషన్ నిర్మాణం చేపడుతున్నారు. నాలుగు ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అందుకు తగ్గట్టు ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. అలాగే జాతీయ రహదారి నుంచి నేరుగా రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు చేరు కునేలా స్థలసేకరణ చేపట్టి నాలుగు లేన్లుగా రోడ్డు విస్తరణ చేట్టారు. ఇప్పటికే స్టేషన్ ఆవరణలో పార్కును ఏర్పాటు చేశారు.

130 గ్రామాల వారికి..

గజపతినగరం రైల్వేస్టేషన్ నుంచే గజపతినగరం, బొండపల్లి, మెంటాడ మండలాలకు చెందిన సుమారు 130 గ్రామాలకు వారు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం వేలాది రూపాయలు ఆదాయం ఈ స్టేషన్‌కు సమకూరుతుంది. ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసుతులు కల్పించే దిశగా రైల్వే అధికారులు పనులు చేపడుతున్నారు. ప్లాట్‌ఫామ్‌పై కుర్చీలు, ఫ్యాన్‌లు, కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి..

గజపతినగరం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ప్రతిరోజు అధికంగానే ఉంటుంది. తిరుపతి, ఢిల్లీ, చెన్నై వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు విజయనగరం లేదా విశాఖ వెళ్లి అక్కడ రైళ్లకు ఎక్కాల్సి వస్తోంది. గజపతినగరం స్టేషన్ మీదుగా విశాఖపట్నం-రాయ్‌పూర్ (కోర్బా), దన్‌బాద్-అలెప్పీ (బోకారా), సంబల్‌పూర్-నాందేడ్ (నాగావళి), హిటాయా-యస్వంత్‌పూర్, జునాగడ్-భువనేశ్వర్, హీరాకుడ్-భువనేశ్వర్, సంబల్‌పూర్ -ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఒక్క నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలు మాత్రమే ఈ స్టేషన్‌లో ఆగుతుంది. అప్పట్లో బీజేపీ నాయకుడు, ప్రస్తుత ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు ఢిల్లీ స్థాయిలో పెద్దలతో మాట్లాడి నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ కల్పించేందుకు చొరవ తీసుకున్నారు. దీంతో హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు ఇక్కడినుంచే రాక పోకలు సాగిస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మిగిలిన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌లు కల్పించేందుకు చొరవ చూపాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులకు స్థానిక నాయకులు కోరారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పిస్తే సుదూర ప్రాంతాలకు ప్రయాణం మరింత సులభతరమవుతుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.



గజపతినగరం రైల్వేస్టేషన్



ప్లాట్‌ఫామ్ ఎత్తు పెంపు పనులు జరుగుతున్న దృశ్యం

లారీ ఢీకొని బాలుడి మృతి



లేఖన్ (ఫైల్)

లక్కవరపుకోట (కొత్తవలస), మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లి అగ్నిమాపక కేంద్రం సమీపంలోలారీ ఢీ కొన్న ఘటనలో జనార్దననగర్‌కు చెందిన ఏడేళ్ల బాలుడు ఎ.లేఖన్‌మృతి చెందాడు. శుక్రవారం ఉదయం పాలప్యాకెట్ తీసుకురావడానికి రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వచ్చిన లారీ బాలుడిని ఢీకొట్టింది. దాంతో లేఖన్ అక్కడికక్కడే మృతి చెందినట్టు కొత్తవలస పోలీసులు తెలిపారు. భర్తకు దూరమైన అసూరి వాణి.. ఇద్దరి పిల్లలతో తుమ్మికాపల్లిలో కన్నవారింట ఉంటోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ షన్ముఖరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

ఆటో బోల్తా: ఉపాధి కూలీ..

వీరఘట్టం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చెపువలస గ్రామ సమీపంలో శుక్రవారం ఆటో బోల్తాపడి ఉపాధి హామీ కూలీ అరసాడ ప్రసాద్(49) మృతి చెందాడు. గడగమ్మ గ్రామం నుంచి ఉపాధి పనులు నిమిత్తం సుమారు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న చినగోర పంచాయతీలో ఉన్న ఆరుద్రమ్మ చెరువులో పనిచేసి తిరిగి వస్తున్న సమయంలో అచ్చెపువలస సమీపంలో ఆటో బోల్తాపడింది. ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే వీరఘట్టం పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అరసాడ ప్రసాద్‌ను పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్నా సంతోషమ్మకు ప్రథమ చికిత్స నిర్వహించి ఇంటికి పంపించారు. ఆటో బోల్తాపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జి.కళాధర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

భోగాపురం, మే16(ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిపై అక్కివరం జంక్షన్ సమీపంలో ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాకుళం జిల్లా గార మండలం శ్రీకూర్మం గ్రామానికి చెందిన హేమలత (19) శుక్రవారం మృతి చెందినట్టు ఎస్‌ఐ పాపారావు తెలిపారు. ఎస్‌ఐ తెలిసిన వివరాల మేరకు.. ఈనెల 10న ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారిపై అక్కివరం జంక్షన్ సమీపంలో డివైడర్‌ను ఢీ కొని ప్రమాదానికి గురయ్యారన్నారు. ముగ్గురూ గాయాలపాలయ్యా రన్నారు. అందులో హేమలత శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

లక్కవరపుకోట (కొత్తవలస), మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలో చింతలపాలెం రెవెన్యూ జంగాలపాలెం గ్రామానికి చెందిన బోని సత్యం (60) శుక్రవారం గ్రామంలోని వాటర్ ట్యాంకు ఎక్కి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్టు పోలీసులకు ఫోన్ ద్వారా తెలిపాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని రక్షించి కౌన్సిలింగ్ చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

దొంగతనం కేసులో నలుగురికి జైలు

విజయనగరం క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2021లో నమోదైన దొంగతనం కేసులో నలుగురు వ్యక్తులకు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం విజయనగరం మొబైల్ కోర్టు న్యాయాధికారి పి.బుజ్జి తీర్పు వెల్లడించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని కె.ఎల్.పురంలో జరిగిన దొంగతనంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ రాజా సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేశారన్నారు. దర్యాప్తు చేపట్టి నగరానికి చెందిన ఆముజూరికుమార్, కె.దేవీప్రసాద్, ఎం.చిట్టిబాబు, బి.దుర్గాఉపేంద్రలను అరెస్టు చేసి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారన్నారు. కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారన్నారు. నేరారోపణలు రుజువు కావడంతో న్యాయాధికారి.. వారికి శిక్ష ఖరారు చేశారని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

లైంగిక వేధింపుల కేసులో రెండేళ్లు..

విజయనగరం క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2020లో నమోదైన లైంగిక వేధింపుల కేసులో వ్యక్తులకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ శుక్రవారం మొబైల్ కోర్టు న్యాయాధికారి పి.బుజ్జి తీర్పు వెల్లడించినట్టు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం పట్టణానికి చెందిన ఆర్జి సూర్యనారాయణ, ఆర్జి లక్ష్మీప్రసన్న ఆస్తి విషయమై తనతో గొడవ పడి లైంగికంగా వేధించారని కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన మహిళ ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ బి.దేవి కేసు నమోదు చేశారన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రాలను దాఖలు చేశారన్నారు. వారిపై నేరారోపణలు రుజువు కావడంతో న్యాయాధికారి శిక్ష ఖరారు చేశారని సీఐ తెలిపారు.

చిన్నారిపై కుక్కల దాడి

రాజాం రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాలెపువీధిలో శుక్రవారం ఉదయం ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారి గంపల లలితపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. భయంతో కేకలు వేస్తున్న లలిత పరిస్థితిని గమనించిన స్థానికులు కుక్కల బారి నుంచి చిన్నారిని రక్షించారు. రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. గతంలో ఒకేరోజు రాజాం బస్టాండ్ ప్రాంతం నుంచి డోలపేట వరకూ కుక్కల గుంపు 18 మందిని గాయపరిచిన ఘటన రాజాం వాసులు మరచిపోక ముందే మళ్లీ కుక్కలు దాడిచేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రేగ పుణ్యగిరి రోడ్డు పూర్తి చేయండి

శృంగవరపుకోట, మే 16 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శివారు రేగ పుణ్యగిరి కొండ శిఖర గ్రామానికి రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలని జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు, సీపీఎం పార్టీ నాయకుడు మద్దిల రమణ... గిరిజనులతో కలసి వేర్వేరుగా డిమాండ్ చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టిన అనంతరం వారు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన లారీ

గజపతినగరం, మే16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలిపేట వద్ద శుక్రవారం తెల్లవారు జామున ఓ లారీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొంది. దాంతో ఆరు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. గజపతినగరం నుంచి మెంటాడ వైపు వెళుతున్న లారీ అదుపు తప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. దాంతో ఆరు విద్యుత్ స్తంభాలు విరిగి నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని సిబ్బంది మరమ్మతులు పనులు చేయిస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఏఈ తెలిపారు.

ఉద్యాన పంటల నష్ట పరిశీలన

విజయనగరం కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): గాలి బీభత్సానికి దెబ్బ తిన్న ఉద్యాన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జమదగ్ని తెలిపారు. ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో 'గాలుల అలజడి' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అందుకు ఉద్యాన శాఖ అధికారి స్పందించారు. నాలుగు రోజులు జిల్లాలో అరటి పంట 22.75 ఎకరాలు, బొప్పాయి పంట 11 ఎకరాల్లో నష్టం జరిగిందని కలెక్టరుకు నివేదిక అందజేసినట్టు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

జామి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పలు ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను శుక్రవారం ఏర్పాటు చేసినట్టు ఎస్‌ఐ వీరజనార్దన్ తెలిపారు. దొండపర్తి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు.

విజయోత్సవ ర్యాలీ నేడు

శృంగవరపుకోట, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం ఉదయం 10 గంటలకు భారత్ జవాన్‌లకు మద్దతుగా అపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీను చేపడుతున్నట్టు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. దేవి కూడలి నుంచి జాతీయ జెండాలతో రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అందరూ విజయవంతం చేయాలని ఆమె కోరారు.

చెరువులను అభివృద్ధి చేసుకోండి

వేపాడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు నీటి పన్ను చెల్లించి చెరువులను అభివృద్ధి చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ సన్యాసినాయుడు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 29 రెవెన్యూ గ్రామాలు ఉండగా అందులో పూర్తిగా 19 రెవెన్యూ గ్రామాల నుంచి నీటి పన్నులు పెద్ద ఎత్తున రావాల్సి ఉందన్నారు. రూ.46 లక్షలు నీటి పన్ను బకాయిలు ఉందన్నారు. వాటిని త్వరగా చెల్లించాలన్నారు.

లింకు రోడ్డుకు శంకుస్థాపన

లక్కవరపుకోట, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లివీడు జంక్షన్‌లో ఉత్తరావల్లి-గనివాడ గ్రామాల లింగు రోడ్డుకు శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శంకుస్థాపన చేశారు. ఏళ్లనాటి కల నెరవేరిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏబీఏ రాంప్రసాద్, కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, కొల్లు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె వాయిదా

దత్తిరాజేరు, మే 16(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 20న జరగాల్సిన కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా పడిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. భారత్-పాక్ ఘర్షణ వాతావరణం పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కార్మిక సంఘాల స్వతంత్ర ఫెడరేషన్లు సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించాయని తెలిపారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

నిరాజాం, మే 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజాసేవపై జగన్‌కు ధ్యాస లేదు: కళా



జీవో కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే కళా

చీపురుపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న జగన్మోహనరెడ్డి ప్రజాసేవపై ఏమాత్రం దృష్టి పెట్టలేదని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు విమర్శించారు. శుక్రవారం సాయంత్రం చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లు ప్రజాధనాన్ని ఎలా లూటీ చేయాలో ఆలోచించారే తప్ప అభివృద్ధి లేదన్నారు. మద్యంలో ఆయన ప్రవేశ పెట్టిన సొంత బ్రాండ్ల వల్ల సుమారు 30 వేల మంది లివర్ వ్యాధికి గురయ్యారన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరుగుతోందన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్ర మూకలను అణచివేయడంలో ప్రధాని మోదీ చూపించిన తెగువ దేశ ప్రజలందరినీ ఆకట్టుకుందన్నారు. అనంతరం దివంగత ఆర్మీ ఉద్యోగి చందక గోవింద్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంజూరైన రూ.5 లక్షలకు సంబంధించిన జీవోను ఎమ్మెల్యే అందజేశారు. సమావేశంలో నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, కోట్ల మోతీలాల్ నాయుడు, మహంతి అప్పలనాయుడు, సారేపాక సురేష్, విసినిగిరి శ్రీనివాసరావు, ఆరతి సాహు తదితరులున్నారు.

టీం తారక్ సేవలు అభినందనీయం



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాగార్జున

చీపురుపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): టీం తారక్ సభ్యులు ప్రజల కోసం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన శుక్రవారం ఆయన తన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 20న జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు సేవలందించడంలో టీం తారక్ సభ్యులు ఎప్పుడు ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీం సభ్యులు ఎం.షన్ముఖరావు, ఇజ్జాడ అప్పలనాయుడు, ఎన్.నారాయణరావు, ఎం.లక్ష్మణరావు, కుమిలి ప్రసాద్, మణకంఠ, సురేష్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తా

చీపురుపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు, బ్యాంకు వినియోగదారుల అభ్యున్నతికి తన వంతు తోడ్పాటునందిస్తానని డీసీసీబీ చైర్మెన్ కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం పట్టణంలోని నివాసంలో శ్రీకాకుళం సహకార బ్యాంకు సీఈవో దత్తు సత్యనారాయణ ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలో బ్యాంకు అందిస్తున్న సేవలను చైర్మన్ నాగార్జునకు వివరించారు. బ్యాంకు శాఖలు, పీఏసీఎస్‌ల పనితీరును తెలిపారు. అనంతరం చీపురుపల్లి డీసీసీబీ బ్రాంచి మేనేజరు, సిబ్బంది నాగార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ

విజయనగరం క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. అధికారులు, సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తామన్నారు.

కనీస వేతనం అమలు చేయండి

రాజాం రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కార్మిక నాయకుడు రామ్మూర్తినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజాంలో శుక్రవారం ఆశాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ హెల్త్‌మిషన్ ప్రారంభమై రెండు దశాబ్దాలు గడ చినా ఆశా కార్యకర్తలకు ఉద్యోగులుగా గుర్తించిన పరిస్థితి లేదన్నారు. కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని ఆయన ప్రభుత్వానికి ఆయన డిమాండ్ చేశారు.

రక్తహీనత లేకుండా చూసుకోవాలి

రేగిడి, మే 16 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించాలని రేగిడి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.నూకాలమ్మ, ఏఎన్‌ఎం సింహాచలం అన్నారు. మండలంలో ఓరంగరాయపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలికలు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రధానంగా రక్తహీనత వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్త త్రివేణి ఉన్నారు.

ప్రజాదర్బార్‌కు 50 వినతులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రజాదర్బార్ నిర్వహించారు. 50 వినతులను ఆయన స్వీకరించారు. అనంతరం ఎమ్మెలల్యే మాట్లాడారు. వినతుల్లో అధికంగా రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, రెవెన్యూ సమస్యలపై ఉన్నాయన్నారు. గతంలో వచ్చిన వినతులను 90 శాతం వరకు పరిష్కరించామన్నారు. ఈసారి అందిన వినతులను కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కార్యకర్తే అధినేత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోండ్రు నిర్వహించారు. పార్టీ జెండా మోసే కార్యకర్త కోసం ఆలోచించిన మొట్టమొదటి పార్టీ టీడీపీ అన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అప్పలనాయుడుకు పరామర్శ

రాజాం, మే 16 (ఆంధ్రజ్యోతి): లావేరు మండలం లింగాలవలసకు గ్రామానికి చెందిన బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు లుకలాపు అప్పలనాయుడు తండ్రి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో శుక్రవారం ఆయన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పరామర్శించారు. అప్పలనాయుడు తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో మాట్లాడి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు రాజాం నియోజకవర్గం నాయకులు దుప్పలపూడి శ్రీనివాసరావు, బోర నారాయణరావు, మడ్డు హరి, టంకాల నాగరాజు, పిల్లా సత్యంనాయుడు, గురవాన నారాయణరావు, కిమిడి అశోక్‌కుమార్, యు.వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

'తారకరామ' సమస్యలు పరిష్కరించండి



బంగార్రాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారక రామ తీర్థ సాగర్ రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని గ్రామ పెద్దలు సారిపల్లి బాబూరావు, బోను మహంతి ఆదినారాయణ, పి.వెంకటరావు తదితరులు కోరారు. శుక్రవారం మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు నివాసంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వాయర్ నిర్మాణం కారణంగా తమ గ్రామానికి చెందిన వందలాది ఎకరాల భూమిని కోల్పోయామన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపచేయాలని చాలాకాలం నుంచి కోరుతున్నామన్నారు. గత ప్రభుత్వం ప్రాజెక్టు ఎఫెక్టెడ్ ఫ్యామిలీస్ (పీఏఎఫ్) ప్యాకేజీ అమలు చేస్తామంటూ 1400 మందితో జాబితా తయారుచేశారని, నిజానికి అర్హులు 1600 మంది వరకు ఉన్నారన్నారు. వారందరికీ ఏఏఎఫ్ అమలు చేయాలన్నారు. కెనాల్ కోసం సుమారు 60 మంది రైతులు 22 ఎకరాల భూమిని కోల్పోయారని, ఆ భూమికి సంబంధించి నష్ట పరిహారం అందలేదన్నారు. కార్యక్రమంలో బాబూరావు, ఆదినారాయణ, వెంకటరావు, గోపాలమూర్తి, సన్యాసిరావు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టిసారిస్తా

భోగాపురం, మే16 (ఆంధ్రజ్యోతి): తన దృష్టికి వచ్చిన అన్ని సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా ప్రత్యేక దృష్టి సారిస్తానని నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. శుక్రవారం పోలిపల్లిలో కార్యకర్తే అధినేత కార్యక్రమాన్ని నిర్వహించి పలువురి నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి సింహాచలం, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

16 కిలోల గంజాయితో నలుగురి అరెస్టు

లక్కవరపుకోట (కొత్తవలస), మే 16(ఆంధ్రజ్యోతి): కొత్తవలస రైల్వే స్టేషన్‌లో శుక్రవారం 16 కిలోల గంజాయితో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ షన్ముఖరావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ వాంబే కాలనీకి చెందిన జోజిబాబు, శ్యామ్యూల్ జాన్, మణికంఠ, మహేశ్వరరావు.. ఒడిశా వద్ద పాడువలో గంజాయి కొనుగోలు చేసి రెండు బ్యాగుల్లో సర్దుకుని కిరండోల్ పాసింజర్‌లో కొత్తవలవ వచ్చారన్నారు. విశాఖ వెళ్తే దొరికిపోతామనే భయంతో కొత్తవలసలో దిగి అక్కడ నుంచి బస్సులో విజయవాడ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రైల్వేస్టేషన్ ఎదుట అనుమానాస్పదంగా వారు కనిపించడంతో పోలీసులు తనిఖీలు చేశారన్నారు. దాంతో గంజాయి బయటపడిందన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విజయనగరం జీఆర్పీ పోలీసులు ఎస్‌ఐ బాలాజీరావుకు అప్పగించినట్టు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

భోగాపురం, మే16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపలకంచేరులో మద్యంతో వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ శాఖ సీఐ వి.రవికుమార్ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేసున్నారనే సమాచారంతో దాడి చేశామన్నారు. 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయనతో పాటు ఎస్‌ఐ చంద్రమోహన్, హెచ్‌సీ రామారావు, మహేశ్ పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

విజయనగరం రింగురోడ్డు, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో జీవనరాణి, నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కా ర్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగీ వ్యాధి వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. మనిషి నుంచి మనిషికి దోమల ద్వారా వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో దోమలు వ్యాప్తిని నివారించేందుకు పరిశీలించడం, శుభ్రం చేయడం, మూతలు పెట్టడం వంటి విధానాలను అవలంబించాలన్నారు. ప్రతి శుక్ర వారం డ్రైడే పాటించడం ద్వారా దోమల నివారణకు అవకాశం ఉంద న్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో రాణి, వరప్రసాద్‌రెడ్డి, డీపీ రమణ పాల్గొన్నారు.

● విజయనగరం రూరల్: ప్రపంచ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు, అనంతరం సదస్సును నిర్వహించారు. ఈ సంద ర్భంగా డెంగీ వ్యాధి నివారణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన కరప త్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టరు అఖిల, కార్తీక్, రాకోడు సిబ్బంది శ్రీరామమూర్తి, శ్రీనివాసరావు, హైమావతి, చిన్నారావు, కృష్ణ, ప్రసాదరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

డంగభద్ర ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

జియ్యమ్మవలస, మే 16 (ఆంధ్రజ్యోతి): డంగభద్ర పంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వావిలాపల్లి శ్రీకాంత్‌పై శుక్రవారం అదే గ్రామంలో ఎంపీడీవో కె.ధర్మారావు ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. 2024 అక్టోబరు 8లో జరిగిన సోషల్ ఆడిట్‌లో 46 మంది వేతనదారులు శ్రీకాంత్‌పై ఆడిట్ బృందానికి ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో డ్వామా పీడీ రామచంద్రరావు ఆదేశాల మేరకు ఎంపీడీవో విచారణ చేపట్టారు. శ్రీకాంత్ వారానికి ఒక్కొక్క వేతనదారుడి వద్ద నుంచి రూ.100లు, పనికి రానివారి వద్ద నుంచి రూ.200లు చొప్పున వసూళ్లు చేశారని ఆరోపిస్తూ వేతనదారులు ఫిర్యాదు చేశారని చెప్పారు. 46 మంది ఫిర్యాదుదారుల్లో 19 మంది ఈ విచారణకు హాజరయ్యారు. వారి వద్ద నుంచి ఎంపీడీవో లిఖిత పూర్వక వాంగ్మూలం తీసుకున్నారు. అయితే ఆయన బయటకు రాగానే కొంతమంది గ్రామస్థులు ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌నే కొనసాగించాలని మెమోరాండం ఇవ్వడం గమనార్హం. దీనిపై ఎంపీడీవో విలేకర్లతో మాట్లాడుతూ పూర్తి నివేదికను పీడీ రామచంద్రరావుకు పంపిస్తామని తెలిపారు. ఈయన వెంట జూనియర్ అసిస్టెంట్ ఎంసీహెచ్ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

మక్కువ, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పనసభద్ర ఎంపీటీసీ సభ్యుడు సామంతుల వెంకట్‌కు నివాళులు అర్పించారు. అనంతరం సమావేశంలో మండల వ్యవసాయశాఖ అధికారి బొత్స శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శంబర ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు రైతులకు ముందుగా సిద్ధం చేసి ఉంచాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం వివిధ శాఖల వారీగా ప్రగతి నివేదికలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చినగుడబలో అగ్ని ప్రమాదం


దగ్ధమైన పెంకిటిళ్లు

గరుగుబిల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): చినగుడబ గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పెంకిటిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన ముడిల కళావతి, మోహనరావు, భాస్కరరావులకు చెందిన గృహాల్లో దుస్తులు, ధాన్యం, నగదుతో పాటు పలు రకాల వస్తువు లు కాలిబూడిదయ్యాయి. కళావతి ఇంట్లో దీపం వెలిగించి ఉపాధి పనుల కు వెళ్లడంతో ఈ ప్రమాదం నెలకొందని గ్రామస్థులు తెలిపారు. సమాచా రం తెలుసుకున్న పార్వతీపురం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాద ఘటనలో సుమారు రూ.5లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించిందని అంచనా వేశారు. సమా చారం తెలుసుకున్న తహసీల్దార్ పి.బాల, ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వపరంగా సహాయం చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

నిరుద్యోగులకు టెండర్ల అవకాశం ఇవ్వాలి

గుమ్మలక్ష్మీపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఉన్న ఆశ్రమ పాఠశాలలకు, వసతిగృహాలకు, గురుకుల, ఏకలవ్య పాఠశాలలకు, కళాశాలలకు టెండర్లు, కూరగాయలు, పండ్లు, చికెన్, కోడిగుడ్లు, పాలు తదితర సరుకుల సరఫరా చేయడానికి టెండర్లు గిరిజన నిరుద్యోగ యువతకు మాత్రమే ఇవ్వాలని గిరిజన సంఘం నాయకులు సీతారాం కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటీడీఏ టెండర్లు ఎప్పుడు చూసినా నాన్ ట్రైబుల్, నాన్ లోకల్ వారికి టెండర్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇప్పటికే గిరిజన నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన పరిస్థితి ఉంటుందని, కనుక ఐటీడీఏ అధికారులు స్పందించి ఈ విద్యా సంవత్సరం నుంచి టెండర్ల అవకాశాలు గిరిజన నిరుద్యోగ యువతకు ఇవ్వాలని కోరారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

మక్కువ, మే 16 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించాలని పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో బొత్స అనంతలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక 1, 2 సచివాయాల్లో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. వేసవి సెలవుల్లో కిశోర బాలికలకు వివిధ అంశాలపైన శిక్షణ ఇవ్వాలన్నారు. కౌమార దశలో బాలికలకు రక్తహీనత, బాలల హక్కులు-రక్షణ, పోక్సో చట్టం, బాల్య వివాహాల పట్ల జరిగే అనర్థాలపై సమావేశాల్లో వివరించాలన్నారు. అనంతరం ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, పంచాయతీ ఈవో కంది సురేష్, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'మన మిత్ర'ను వినియోగించుకోండి

గరుగుబిల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మెరుగైన సేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన మన మిత్ర వాట్సాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి కోరారు. శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా సమాచారాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇంటి వద్ద నుంచే పలు రకాల సేవలను పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన 9552300009 నెంబరుకు మిస్డ్ కాల్ చేసి సేవలను పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు వీఆర్ఆర్ ప్రసాద్, ఏపీవో ఎం.గౌరీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీజీఈఏ కార్యవర్గం ఎన్నిక

సీతంపేట రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏపీజీఈఏ తాలూక యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. సీతంపేట గ్రామంలోని సమావేశం మందిరంలో కొత్తగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా బబ్బురు గణేష్‌బాబు, కార్యదర్శిగా పి.రాంజీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీజీఈఏ ఎన్నికలకు రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామచంద్రరావు, జిల్లా నాయకులు ఎన్.భరత్‌భూషన్, అధ్యక్షుడు కె.శంకర్రావు, జిల్లా కార్యదర్శి సింహాచలం, ఐటీడీఏ టైంస్కేల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు వై.సతీష్‌కుమార్ తోపాటు ఉద్యోగులు హాజరై అభినందనలు తెలిపారు.

దరఖాస్తుల పరిశీలన వాయిదా

గరుగుబిల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకున్న షెడ్యూల్ కులాలకు చెందిన వారి దరఖాస్తుల పరిశీలన వాయిదా వేశామని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 16న పరిశీలన జరగాల్సి ఉండగా, ఉన్నతాధికారులు అందించిన సమాచారం మేరకు వాయిదా పడిందన్నారు. 25 పంచాయతీల పరిధిలో 16 యూనిట్లుకు 115 మంది పలు రకాల యూనిట్లు కోసం ఏపీఓబీఎంఎంఎస్‌లో నమోదు చేసుకున్నారని ఆమె తెలిపారు. తదుపరి సమాచారం అందిన వెంటనే లబ్ధిదారులకు సమాచారం అందిస్తామని చెప్పారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతాం

గరుగుబిల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి తెలిపారు. శుక్రవారం మండలంలోని గరుగుబిల్లి, ఉల్లిభద్ర ప్రాంతాల్లో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఆమె అవగాహన కల్పించారు. ఉల్లిభద్రను సారా రహిత గ్రామంగా గుర్తించామని చెప్పారు. అనంతరం మద్యం దుకాణాలను తనిఖీలు చేశారు. మద్యాన్ని ఎమ్మార్పీకే అమ్మకం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మి, వీఆర్వో శ్రీనివాసరావు, ఎస్ఐ షరీఫ్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎళ్లవేళలా సేవ చేస్తా


తోణం పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

● మంత్రి సంధ్యారాణి

సాలూరు/ మక్కువ, మే 16(ఆంధ్రజ్యోతి): 'మీ బిడ్డగా మీకు ఎళ్లవేళలా సేవ చేస్తాన'ని రాష్ట్ర స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మక్కువ మండలం పనసభద్ర పంచాయతీ మూలవలస గ్రామంలో మంగళవారం నిర్వహించిన గంగమ్మతల్లి పండుగ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమెకు గిరిజనులు థింసా నృత్యాలతో స్వాగతం పలికారు. ముందుగా గంగమ్మతల్లి ఘటాలను ఆమె తలపై పెట్టుకుని గిరిజనులతో కలిసి తిరిగారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. మండలంలో ఉన్న 21 పంచాయతీల సమస్యలను దశలవారీగా నెరవేరుస్తానని తెలిపారు. నెల రోజుల్లో తాగునీటి పథకాలకు శంకుస్థాపన చేస్తానన్నారు. అటవీ శాఖాధికారులతో మాట్లాడి కుంజుపాకతోపాటు అనేక గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తానని తెలిపారు. దుగ్గేరులో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించే పూచీ తనదని భరోసా ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో 200 కుటుంబాల చేరిక

పనసభద్ర పంచాయతీ పరిధిలో ఉన్న 14 గ్రామాల నుంచి 200 మంది మంత్రి సంధ్యారాణి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆమె కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కోట శంకరనాయుడు, వీరభోజ వసంతరాయ లు, ఏఎంసీ వైస్ చైర్మన్ మెంతి సింహాచలం, డాక్టర్ మళ్లేశ్వరరావు, గౌరీశం కరరావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

సాలూరు: సాలూరు గ్రామదేవత అమ్మవారి పండుగ నిమిత్తం పట్టణంలో 20 ట్రాన్స్‌ఫార్మర్లను నూతనంగా అమర్చారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్లను మంత్రి సంధ్యారాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్యామలాంబ పండుగ నేపథ్యంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో మాట్లాడి రూ.కోటి 60లక్షల నిధులు తెప్పించి పట్టణంలో 20 ట్రాన్స్‌ఫార్మర్లు, వందకు పైగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యుత్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలు రాకుండా చూడాలి

గిరిజనులకు ఆరోగ్య సమస్యలు రాకుండా చూడాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. సాలూరు మండలం లోని తోణాం గ్రామంలో నూతనంగా రూ.కోటి 82 లక్షలతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సాలూరు మండలంలో మొట్టమొదటి సారిగా కంటైనర్ ఆసుపత్రి నిర్మించిన ఘనత కూటమి ప్రభుత్వానిదని అన్నారు. అనంతరం అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు, అక్కేన తిరుపతిరావు, బలివాడ కిరణ్‌కుమార్, బలివాడ వెంకటేష్, బలివాడ రజనీతోపాటు తోణాం వైద్యులు ఏ.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఈఈగా విష్ణుమూర్తి

పాలకొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో ఈఈగా విష్ణుమూర్తి శుక్రవారం విధుల్లో చేరారు. ఈసందర్భంగా ఆయన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. ఏ చిన్నపాటి సమస్య ఉన్నా ప్రజలకు ఇబ్బందులు లేకుండా సిబ్బందితో పనిచేయించాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట పలువురు ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో చేర్పించండి

కురుపాం, మే16(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని కోరుతూ శుక్రవారం కురుపాంలో స్థానిక భవిత కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహించారు. ఈనెల 13వ తేదీ నుంచి కురుపాంలో ఉన్న భవిత కేంద్రంలో చేర్పించేందుకు ఇంటింటికి వెళ్లి పిల్లల వివరాలు సేకరిస్తున్నారని ఎంఈవో సత్యనారాయణ తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

బొబ్బిలి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): కోమటిపల్లి గ్రామ శివారున శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో వెలమల లక్ష్మునాయుడు అనే వ్యక్తిని 30 మద్యం సీసాలతో పట్టుకున్నామని హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు బొబ్బిలి సీఐ కె.సతీష్‌కుమార్ ఆదేశాలతో దాడి చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బాడంగి, మే 16(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బాడంగి ప్రధాన రహదారిలో గల మసీదుకు దగ్గరలో పట్టుకున్నట్టు సీఎస్‌డీటీ స్వర్ణలత తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పూడివలస గ్రామానికి చెందిన పెద్దాడ వెంకటరమణ పలుమార్లు అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో నిఘా పన్ని పట్టుకున్నామని చెప్పారు. పట్టుకున్న ఆరున్నర క్వింటాళ్ల బియ్యం డొంకినవలస గోదాంకు తరలించామన్నారు. నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే పలుమార్లు ఈ వ్యక్తిని పట్టుకున్నందున త్వరలోనే నిందితుని రేషన్‌కార్డును కూడా రద్దు చేయనున్నట్టు ఆమె తెలిపారు.

'తహసీల్దారు ఫిర్యాదు' కలకలం

పార్వతీపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఓ లేఖ సామాజిక మాధ్యమాల్లో శుక్రవారం హల్‌చల్ చేసింది. అందులో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తహసీల్దార్‌కు వాట్సాప్ కాల్‌చేసి.. మహిళ అని చూడకుండా అసభ్య పదాలతో దూషించినట్లు ఉంది. దీనిపై ఎమ్మెల్యే విజయచంద్ర స్పందిస్తూ..' పార్వతీపురం మండలం ములగ గ్రామంలో 50 ఏళ్లుగా సాగు చేస్తున్న వారి భూములకు సంబంధించి తహసీల్దార్ డిజిటల్ సంతకం కావడం లేదని రైతులు నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని సబ్‌కలెక్టర్‌కు తెలియజేయగా.. ఆయన తహసీల్దార్‌ను ఆదేశించారు. డిజిటల్ సంతకం చేయకపోవడంపై కారణాలు తెలుసుకునేందుకు గురువారం సుమారు 50 సార్లు తహసీల్దార్‌కు ఫోన్ చేసినా ఆమె స్పందించ లేదు. డిజిటల్ సంతకం కోసం రైతుల నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేసి రూ.2 లక్షల ఆమె తీసుకున్నట్లు అడగాలని ఫోన్ ద్వారా ప్రయత్నించా. కానీ తహసీల్దార్ ఫోన్ లిఫ్ట్ చే యలేదు. ఇదే విషయాన్ని సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవకు ఫోన్ చేసి చెప్పాను. తహసీల్దార్‌తో ఫోన్ చేయిస్తానని ఆయన చెప్పారు. ఆ తర్వాత తహసీల్దార్ వాట్సప్ కాల్ చేసి సుమారు 39 సెకన్లు నాతో మాట్లాడారు. ఎందుకు రైతుల దగ్గర నుంచి డబ్బులు తీసుకున్నారు. ఫోన్ ఎందుకు లిఫ్ట్ చేయడం లేదని నేను అడిగా. దీనికి ఆమె స్పందిస్తూ.. నేను తహసీల్దార్‌ని.. నా ఇష్టం.. అని సమాధానం ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పని చేసినట్లు ఇప్పుడు పని చేస్తే కుదరదని నేను ఆగ్రహం వ్యక్తం చేశా. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పా.' అని ఆయన తెలిపారు. దీనిపై సబ్ కలెక్టరేట్ వద్ద ఉన్న తహసీల్దార్ జయలక్ష్మిని వివరణ కోరగా.. ఆ ఫిర్యాదుపై క్లారిటీ లేదని ఆమె చెప్పారు. మరోవైపు పోలీసులు కూడా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వెళ్లడం కనిపించింది. తహసీల్దార్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు ధ్రువీకరించలేదు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి

బొబ్బిలి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ఎన్టీఆర్ బొమ్మ జంక్షన్, పూల్‌బాగ్, జంగాల శివాలయం ఏరియాలలో ఆమె శుక్రవారం పర్యటించారు. ఎన్టీఆర్ బొమ్మ వద్ద ఉన్న వైన్‌షాప్ యజమానులు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో చెత్తను వేస్తున్నట్లుగా ఆమె గుర్తించారు. వారికి నోటీసులు జారీ చేసి, జరిమానా విధించాలని సిబ్బందికి ఆదేశించారు. జంగాల శివాలయం వీధిలో ఉన్న పురపాలక సంఘానికి చెందిన స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మస్టర్ కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు.

వుషూ పోటీల్లో సత్తా చాటారు


పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

భామిని, మే 16 (ఆంధ్రజ్యోతి): కర్నూల్‌లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి వుషూ ఆటల పోటీల్లో భామిని యువత సత్తా చాటినట్టు కోచ్‌లు తెలిపారు. జూనియర్, సీనియర్, సబ్ జూనియర్ క్రీడల్లో శాంతి, దీపిక, సోమేషు బంగారు పతకాలు సాధించగా, నాగరాజు, చరణ్, శ్రీధర్, తేజ బ్రాంజ్ మెడల్స్ సాధించినట్టు కోచ్‌లు శివారెడ్డి, సోమేషు శుక్రవారం తెలిపారు. మరిన్ని విజయాలు సాధించి మండలం పేరును నిలబెట్టాలని టీడీపీ నాయకులు రవినాయుడు, జనసేన కన్వీనర్ కిరణ్‌కుమార్‌లు క్రీడాకారులను అభిలాషించారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


సీతంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధిపై ప్రజలందరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతీ అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా సీతంపేట గ్రామంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీవో బీబీ మిశ్రో, దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● కురుపాం: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కురుపాంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూవోలు ర్యాలీ నిర్వహించారు. ● భామిని: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్ర వారం భామిని, బత్తిలి, బాలేరు పీహెచ్‌సీల పరిధిలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో వైద్యాధికారులు సోహెల్, శాంతిలక్ష్మీ, శివకు మార్, దామోదర్ పాల్గొన్నారు. ● వీరఘట్టం: డెంగీ దినోత్సవం సందర్భంగా వీరఘట్టంలో పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వైద్యుడు బి.ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. ● గరుగుబిల్లి: డెంగీ దినోత్సవం సంద ర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.సంతోష్‌కుమార్, కాసులవర్మ ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఇతర విధుల్లో పారిశుధ్య కార్మికులు

● పాలకవర్గ సమావేశం దృష్టికి తీసుకొచ్చిన కౌన్సిలర్లు


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో పలువురు పారిశుధ్య కార్మికులు ఇతర విధుల్లో నిమగ్నమవుతున్నారని కొంతమంది కౌన్సిలర్లు ఆరోపించారు. ఈ విషయాన్ని శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ప్రస్తావించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ పారిశుధ్య పనులకు నియమించిన సిబ్బంది ఆ పనుల్లోనే నిమగ్నం కావాలని కమిషనర్ రత్నరాజుకు సూచించారు. అలాగే కౌన్సిల్ తీర్మానం లేకుండా శానిటేషన్ సిబ్బందిగా ఒక వ్యక్తిని నియమించడం పట్ల కౌన్సిలర్లు వ్యతిరేకించారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా కొంత మొత్తాన్ని వసూలు చేసి విధుల్లోకి తీసుకున్నారని, ఆ వ్యక్తిని తొలగించాలని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి అటువంటి నియామకాలపై దృష్టి పెట్టాలని కమిషనర్‌కు సూచించారు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కల్వర్టును తొలగించారని, కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఓ కౌన్సిలర్ కోరారు. కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని, నిర్మాణం చేపడతామని కమిషనర్ తెలిపారు. పట్టణంలో జరిగే ఏ అభివృద్ధి పనులకైనా టెండర్లు వేసే క్రమంలో ఒక్క టెండర్ వస్తే రద్దు చేసి మళ్లీ టెండర్లకు పిలవాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు.

వ్యాసరచన పోటీల్లో యశస్విని ప్రతిభ


యశస్వినిని అభినందిస్తున్న హెచ్ఎం

బొబ్బిలి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15వ తేదీన గోపాలపట్నం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో వ్యాసరచన విభాగంలో బొబ్బిలి మండలం పెంట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తమ్మిరెడ్డి యశస్విని ప్రతిభ కనబరిచింది. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈనెల 22న అమరావతిలో ఆమె ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతులమీదుగా అవార్డును అందుకోబోతుందని పాఠశాల హెచ్ఎం చింత రమణ తెలిపారు. ఈసందర్భంగా యశస్వినిని హెచ్ఎంతో పాటు గైడ్ టీచర్ కె.సింహాచలం, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ బి.వేణుగోపాల్ తదితరులు శుక్రవారం అభినందించారు.

ప్రకటన

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టువారి సముఖమునకు
EP No.03/2024 O.S.53/23

Between:-
శ్రీ కర్రి దుర్గప్రసాద్‌రెడ్డి ....DHR
And:
శ్రీ కట్టమూరి ఈశ్వరరావు ....JDR

పై నెంబరు దావా డిక్రి బాకీ వసూలు చేయు నిమిత్తం JDR తాలూకా యీ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి రెండు అంతస్తులు దాబాయిల్లు వేలం యిస్తియారు షరతులకు లోబడి పై కోర్టులో తే18.06.2025దీన ఉ. 10.30 నుండి సా॥ 5.00 గం.ల మధ్యకాలములో బహిరంగంగా వేలం జరుగును గాన వలయువారు పాడుకోనవచ్చునని ఇందుమూలంగా తెలియచేయడమైనది. యిస్తియారు చూసి తక్కిన బోగట్టా తెలుసుకోనివచ్చును.

షెడ్యూలు వివరములు:
Dist: Vizianagaram (Present Parvathipuram Manyam District), Muncipality : Salur, Village: Salur, Row: Southern Row of Main Road, Door No. 28-351, 28-352, Street:- Main road, locality:- Main road, Nature of the property:- Two staried RCC Slabbed house, Asst. No. 1092004704, Revenue ward no.09, Old Asst. No.90076., TS No : 109-2 **MEASUREMENTS:** East to West: 16 feet, North to South: 45 feet (Approximately), **BOUNDARIES: East:** RCC Slabbed house of Ravva Sai, **South:** RCC Slabbed house of Bandari Trinadha, **West:** RCC Slabbed house of Ravva Sai, **North:** Salur main road. Decree holder value is Rs. 30,00,000/-, Amin value: Rs. 35,00,000/-, JDR value is not furnished: Nill

స్థిరాస్తి వేలం యిస్తియారు షరతులకు లోబడి వేలం కాబడును.

సాలూరు
తేది. 16.05.2025

Sd/-
రేగు సూర్యనారాయణ,
డిక్రీ హోల్డర్ తరుపున న్యాయవాది
సెల్: 7382071863

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి


వినతులు స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను తెలుపుతూ వినతిపత్రాలు అందించా రు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, నాయకులు దత్తి లక్ష్మణరావు, నంగిరెడ్డి మధుసూదన్‌రావు, గుల్లిపల్లి సుదర్శనరావు పాల్గొన్నారు.

బొబ్బిలిలో ప్రజాదర్బార్


వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి కోటలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బేబీనాయన శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఇందులో భాగంగా సీబీఎం పాఠశాలను యథాతథంగా కొనసాగించాలని కోరుతూ విజయనగరం జిల్లా హ్యూమన్ రైట్స్ ఫోరం సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. బొబ్బిలి పట్టణం ఇందిరమ్మకాలనీలో ఉంటున్న థెరిసా రూరల్ అండ్ అర్బన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు క్లైవ్ కూపర్.. తమ సేవా సంస్థకు కార్యాలయం నిర్మించేందుకు ఖాళీ స్థలం మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్యానికి మేలు

బొబ్బిలి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన నవధాన్యాల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డివిజన్ ఏడీఏ ఎం.శ్యామ్ సుందర్, బ్రహ్మకుమారీ రాజేశ్వరి, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

నేడు తిరంగా ర్యాలీ

బొబ్బిలి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కారణంగా బొబ్బిలి పట్టణంలో శనివారం బొబ్బిలి మాజీ సైనికుల ఆధ్వర్యంలో సాయంత్రం బొబ్బిలి కోట నుంచి జాతీయ తిరంగా ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే బేబీనాయన ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మరడ రామినాయుడు, అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్‌లు కోరారు.

● కురుపాం: ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా చేపట్టిన భారత సైనికులకు సంఘీభావంగా ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో శనివారం కురుపాంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, మండల కన్వీనర్ కేవీ కొండయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ రాలీలో నియోజకవర్గంలో గల ఐదు మండలాల కూటమి నాయకులు పాల్గొంటారని చెప్పారు.

ఈదురుగాలులతో అస్తవ్యస్తం

(ఐదో పేజీ తరువాయి)

పరిధి ఎన్ఎస్ఎన్ కాలనీకి చెందిన జోగ లక్ష్మి (45) ఇంటి డాబాపై ఉన్న దుస్తులు తీసేందుకు వెళ్లింది. అయితే ఆ సమీపంలోని చెట్టుపై పిడుగుపడింది. దీంతో స్పృహ తప్పిన ఆమెను స్థానికులు గుర్తించి సపర్యలు చేశారు. కొన ఊపిరితో ఉన్న లక్ష్మిని కుటుంబ సభ్యులు పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆమె భర్త ఎర్రంనాయుడు చిరు వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. లక్ష్మి మృతిని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.